క్లుప్తంగా

విద్యుత్ చార్జీలు తగ్గించాలి



పోస్టర్లను విడుదల చేస్తున్న నాయకులు

చిత్తూరు కార్పొరేషన్: అక్రమంగా వసూలు చేస్తున్న విద్యుత్ చార్జీలను తగ్గించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి గంగరాజు డిమాండ్ చేశారు. కరెంటు బిల్లులు తగ్గించాలంటూ ఆదివారం ఆ పార్టీ కార్యాలయంలో పోస్టర్లను విడుదల చేసి మాట్లాడారు. విద్యుత్ రెగ్యులేటరీ కమిషన్ తుది నిర్ణయం ప్రకారం రు.923 కోట్లు మాత్రమే కాకుండా సంవత్సర కాలంలో ట్రూఅప్ చార్జీలు రూ.2,758 కోట్లు వినియోగదారులకు వాపసు చేయాలన్నారు. పలు రకాలుగా వినియోగదారుల నుంచి వసూలు చేసిన మొత్తాన్ని తిరిగి చెల్లించాలన్నారు. విద్యుత్ అదనపు భారం మోపబోమని ఎన్నికల సమయంలో ప్రకటించిన నారా చంద్రబాబునాయుడు అధికారంలోకి వచ్చాక బాదుడే..బాదుడు మొదలు పెట్టారని విమర్శించారు. కార్యక్రమంలో నాయకులు సురేంద్ర, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

కంటి ఆపరేషన్లకు 78 మంది ఎంపిక



కంటి పరీక్షలు చేస్తున్న నిపుణులు

చిత్తూరు రూరల్(కాణిపాకం): చిత్తూరు నగరం రాముల గుడివీధిలోని జైన్ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి మంచి స్పందన లభించింది. తిరుపతి ఎస్వీ అరవింద్ ఆస్పత్రి వైద్య నిపుణులు కంటి పరీక్షలు చేశారు. శిబిరంలో 163 మందిని పరీక్షించి 78 మందిని ఆపరేషన్లకు ఎంపిక చేశారు. శిబిరంలో నిర్వాహకులు సుభాష్ జైన్, ప్రేమ్‌చంద్, సాగర్, ప్రవీణ్, లలిత్, కమలేష్, అమిత్ తదితరులు పాల్గొన్నారు.

టౌన్ బ్యాంకు పురోభివృద్ధికి కృషి

చిత్తూరు అర్బన్: చిత్తూరు కో–ఆపరేటివ్ టౌన్ బ్యాంకు పురోభివృద్ధికి కృషి చేయనున్నట్లు బ్యాంకు చైర్మన్ రమేష్ నాయుడు అన్నారు. స్థానిక గిరింపేటలోని టౌన్ బ్యాంకుశాఖలో ఆదివారం బ్యాంకు సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, వందేళ్ల చరిత్ర కలిగిన టౌన్ బ్యాంకుకు జవసత్వాలు తీసుకురావడానికి ప్రణాళికబద్ధమైన చర్యలు చేపట్టామన్నారు. ఖాతాదారుల సంక్షేమమే ధ్యేయంగా నూతన పథకాలను అమలు చేస్తామన్నారు. అనంతరం ఖాతాదారుల సలహాలు–సూచనలు స్వీకరించారు. బ్యాంకు సిబ్బందికి జీతభత్యాల పెంచాలని తీర్మానం చేశారు. సమావేశంలో బ్యాంకు పాలకవర్గ సభ్యులు సురేష్, అన్వర్ బాషా, అకౌంట్స్ అధికారి సుమతి పాల్గొన్నారు

ఖాళీ బిందెలతో ధర్నా



పుంగనూరు: తాగునీటి సమస్యతో అల్లాడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని గూడూరుపల్లె వద్ద జగనన్న కాలనీ వాసులు ఆగ్రహం వ్యక్తం చేశారు. తాగునీటి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆదివారం జాతీయ రహదారిపై ఖాళీ బిందెలతో ధర్నాకు దిగారు. దీంతో వాహనాల రాకపోకలు స్తంభించాయి. విషయం తెలుసుకున్న సీఐ సుబ్బరాయుడు అక్కడికి చేరుకుని మహిళలతో చర్చించారు. అధికారులతో చర్చించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని, అప్పటి వరకు ట్యాంకర్లతో నీటి సరఫరా చేయిస్తామని హామీ ఇవ్వడంతో మహిళలు ఆందోళన విరమించారు.

గత తీర్మానాలకే దిక్కులేదు..!

- మండల సమావేశాలకు పరిపాటిగా మారిన అధికారుల గైర్హాజరు
- సభ్యులు సమస్యలు ప్రస్తావించినా పరిష్కారం నిల్
- నేడు యాదమరి మండల సర్వసభ్య సమావేశం



యాదమరి మండల పరిషత్ కార్యాలయం

యాదమరి: ప్రతి మూడు నెలలకోసారి నిర్వహించే మండల సర్వసభ్య సమావేశాలలో చేసిన పలు తీర్మానాలు ఆచరణలో కార్యరూపం దాల్చకపోవడంతో సమావేశాలు నిష్ప్రయోజనంగా మారుతున్నాయి. పంచాయతీలలోని సమస్యలను సమస్యలను ప్రస్తావిస్తున్నా వాటిని పరిష్కరించడం లేదని ఎంపీటీసీలు, సర్పంచులు మండిపడుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇప్పటివరకు 15 నెలల కాలంలో మూడు సమావేశాలు నిర్వహించగా, రెండు సమావేశాలను అధికార కూటమి నేతలు అడ్డుకున్నారు.ఈ నేపథ్యంలో సోమవారం చివరి సమావేశం నిర్వహించనున్నారు. గత సమావేశంలో ట్రాన్స్‌కో, ఉద్యాన శాఖ, సెరికల్చర్, రవాణాశాఖ, ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్, అటవీ తదితర శాఖల అధికారులు గైర్హాజరయ్యారు. కొందరు ఉద్దేశపూర్వకంగా గైర్హాజరవడం, మరికొందరు అధికార పార్టీ నేతల సూచనలతో డుమ్మా కొట్టారనే విమర్శలొచ్చాయి. ఈసారైనా హాజరవుతారా? సమస్యలను పరిష్కరిస్తారా? అనేది ప్రశ్నార్థకంగా మారింది. మరోవైపు చేసిన పలు అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేసినా పాపానపోవడం లేదని కాంట్రాక్టర్లు లబోదిబోమంటున్నారు. అలాగే, ఎంపీటీసీలకు ఇప్పటివరకు గౌరవం వేతనం కూడా ఇవ్వలేదు.

సమస్యలివే..!

- బుడితిరెడ్డిపల్లె పంచాయతీలో ప్రమాదాలకు తావిచ్చేలా ఉన్న విద్యుత్తు తీగలను మార్చాలని గత రెండు సమావేశాల్లో సర్పంచ్ వాసుదేవరెడ్డి అధికారుల దృష్టికి తీసుకు వచ్చినా ఇప్పటివరకూ స్పందించిన పాపానపోలేదు. వీరి నిర్లక్ష్యానికి ఒకరు ఆస్పత్రి పాలయ్యారు. 10 రోజుల క్రితం ముస్లింవాడకు చెందిన రెహ్మాన్ కుమారుడు విద్యుత్తు ప్రమాదానికి గురై తిరుపతి రుయా లో చికిత్స పొందుతున్నాడు.
- కీనాటంపల్లె–వేణుగోపాలపురం వరకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో బీటీ రోడ్డు మంజూరైంది. ప్రభుత్వం మారడంతో పనులు ఆగిపోయాయి. దీంతో ఈ మార్గంలో ప్రజలు అవస్థలు పడుతున్నారు.
- నాగిరెడ్డిపల్లె–144ఒటివారిపల్లెకు బీటీ రోడ్డు వేయాలని కోరినా అతీగతీ లేదు. ఇక పారిశుధ్యం సమస్యలు కూడా తక్కువేమీ కాదు.

కార్యకర్తలకు అండగా 'డిజిటల్ బుక్'


డిజిటల్ బుక్ క్యూ ఆర్ కోడ్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న విజయానందరెడ్డి, పార్టీ నాయకులు

- చిత్తూరు నియోజకవర్గ సమన్వయకర్త విజయానందరెడ్డి

చిత్తూరు కార్పొరేషన్: కూటమి ప్రభుత్వ పాలనలో దౌర్జన్యాలు, అక్రమ అరెస్టులు పరాకాష్టకు చేరాయని వైఎస్సార్‌సీపీ చిత్తూరు నియోజకవర్గ సమన్వయకర్త విజయానందరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం జిల్లా పార్టీ కార్యాలయంలో డిజిటల్ బుక్ క్యూ ఆర్ కోడ్ పోస్టర్లను ఆవిష్కరించి ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు, సానుభూతిపరులు, సోషల్ మీడియా యాక్టివిస్టులను కక్ష సాధింపులతో వేధిస్తోందని, ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో కార్యకర్తలకు అండగా ఉంటానని, అన్యాయం చేసిన ఎవరినీ వదలబోనని పార్టీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్పష్టం చేశారన్నారు. ఈ దిశగా అందరికీ అండగా ఉండేందుకు డిజిటల్ బుక్ ప్రవేశపెట్టారన్నారు. అప్రజాస్వామికంగా వ్యవహరిస్తున్న అధికారులు, పాలకుల ఆదేశాలతో వైఎస్సార్‌సీపీ శ్రేణులను ఇబ్బంది పెడుతున్నవారిని భవిష్యత్తులో వదిలే ప్రసక్తే లేదన్నారు.

వెబ్‌సైట్‌లో నమోదు

అకారణంగా కఠినంగా వ్యవహరించే అధికారుల వివరాలు వెబ్‌సైట్‌లో నమోదు చేస్తామన్నారు. బాధితులు తమ ఇబ్బందులను డీబీ.డబ్ల్యూఈవైఎస్ఆర్‌సీపీ.కామ్ అనే వెబ్‌సైట్‌లో నమోదు చేయవచ్చన్నారు. 040–49171718 నంబర్‌కు కాల్ చేసి కూడా చెప్పవచ్చన్నారు. కార్యక్రమంలో నగర పార్టీ అధ్యక్షుడు కేపీ శ్రీధర్ నాయకులు అంజలిరెడ్డి, నారాయణ, అప్పాజీ, మనోజ్‌రెడ్డి, హరీషారెడ్డి, నౌషద్, రంజిత్‌రెడ్డి, రాజేష్‌రెడ్డి, చిట్టి తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛతా..! ఏదీ నీ చిరునామా..?


ఐరాల వ్యవసాయాధికారి కార్యాలయం వద్ద చెత్తకుప్పను తలపిస్తున్న పరిసరాలు


వీఎస్ అగ్రహారంలో చెత్తాచెదారం, ప్లాస్టిక్ వ్యర్థాలతో దర్శనమిస్తున్న మురుగు కాలువ

ఐరాల: అధికారులు స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నా గ్రామాల్లో పారిశుధ్యం సమస్యలు తాండవిస్తున్నాయి. మురుగు కాలువలు లేకపోవడంతో వీధుల్లోనే మురుగు ప్రవహిస్తుండటం, కాలువలు ఉన్న చోట్ల శుభ్రం చేయకపోవడంతో చెత్తాచెదారం, ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండి దుర్గంధం చిమ్ముతున్నాయి.స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాల కేవలం ప్రచారం, ఆర్భాటాలకే పరిమితమైందని ప్రజలు మండిపడుతున్నారు. స్థానిక న్యూకాలనీలో మురుగు కాలువలు లేకపోవడంతో ఇటీవల వర్షాలకు మురుగు నీరు సీసీ రోడ్లపై చిన్నపాటి మడుగును తలపిస్తున్నాయి. మురుగు కాలువలు నిర్మించాలని ఎన్నోసార్లు అధికారులను కోరినా ఇప్పటివరకు పట్టించుకోలేదని స్థానికులు వాపోతున్నారు. చిన్నవెంకటంపల్లె దళితవాడలో మురుగు కాలువల్లేక పారిశుద్ధ్యం పడకేసింది. పలు గ్రామాల్లో ఇలాంటి పరిస్థితులే కనిపిస్తున్నాయి. ఇకనైనా గ్రామాల్లో పారిశుధ్యం సమస్యలు లేకుండా చేయాలని ప్రజలు కోరుతున్నారు.

భగత్ సింగ్‌కు నివాళి



భగత్‌సింగ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

చిత్తూరు కార్పొరేషన్: విప్లవ వీర కిశోరం సర్దార్ భగత్‌సింగ్ ఆశయాల బాటలో ముందుకు పోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి నాగరాజు అన్నారు. ఆదివారం భగత్‌సింగ్ 118వ జయంతిని ఆ పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ భగత్ సింగ్ 13 సంవత్సరాల వయస్సులో మహాత్మాగాంధీ సహాయ నిరాకరణ ఉద్యమంలో పాల్గొన్నారని, స్వాతంత్య్రోద్యమ పోరాటంలో బ్రిటిష్ ప్రభుత్వాన్ని గడగడలాడించారన్నారు. అప్పట్లో బ్రిటీష్ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానానికి వ్యతిరేకంగా అసెంబ్లీలో పొగబాంబు వేసి సంచలనం సృష్టించారన్నారు. 23 ఏళ్ల వయస్సులో ప్రాణత్యాగం చేశారని కీర్తించారు. భగత్ సింగ్‌తోపాటు రాజ్‌గురు, సుఖదేవ్‌లకు బ్రిటిష్ ప్రభుత్వం ఉరిశిక్ష విధించిందన్నారు. కార్యక్రమంలో నాయకులు గోపీనాథ్, రమాదేవి, బాలాజీరావు, రఘు తదితరులు పాల్గొన్నారు

ఈ–పంట నమోదు వేగవంతంపై దృష్టి


రైతులతో మాట్లాడుతున్న వ్యవసాయాధికారి సంగీత

గుడిపాల: పంటలు సాగు చేసిన రైతులు ఈ–పంట నమోదు చేసుకోవాలని వ్యవసాయాధికారి సంగీత కోరారు.ఈ–పంట నమోదుపై ఆదివారం మండలంలోని వెప్పాలమానుచేను, పాపసముద్రం గ్రా మాల్లో రైతులకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ, మండలంలో మామిడిపంట అధికంగా ఉండడంతో పాటు జ్యూస్ ఫ్యాక్టరీలు కూడా ఎక్కువగా ఉన్నాయన్నారు. వ్యవసాయ సిబ్బందికి అక్కడ డ్యూటీలు వేయడం వల్ల ఈ–పంట నమోదులో కొంత జాప్యమైందన్నారు. ఈ తరుణంలో ఈ–పంట నమోదును వేగవంతం చేయడంపై దృష్టి సారించాలని, రైతులు తాము సాగు చేసిన పంటలను చూపించి ఈ–పంటను నమోదు చేసుకోవాలన్నారు. మండలం కొంత వెనకబడి ఉండడంతో ఆదివారం సెలవురోజైననూ పనిచేస్తున్నామన్నారు. ఇప్పటికీ 5వేల సర్వే నంబర్లు ఈ–పంట నమోదైందని, ఇంకా 45వేల సర్వే నంబర్లు ఈ–పంటలో నమోదు చేయాలని ఆమె తెలిపారు.

జీఎస్టీపై అవగాహన


బంగారుపాళెం: దుకాణదారులకు జీఎస్టీ కరపత్రాలు అందజేస్తున్న సురేంద్రబాబు


గుడిపాల: జీఎస్టీ తగ్గింపుపై అవగాహన కల్పిస్తున్న ఎంపీడీఓ కుమార్

బంగారుపాళెం: నిత్యావసర వస్తువులపై ప్రభుత్వం తగ్గించిన జీఎస్టీ గురించి దుకాణ యజమానులు, వినియోగదారులకు అవగాహన కల్పిస్తున్నట్టు జిల్లా అధికారి సురేంద్రబాబు తెలిపారు. ఆదివారం బంగారుపాళెంలో పలు దుకాణాలకు వస్తువులపై తగ్గిన జీఎస్టీ పన్ను కరపత్రాలను అందజేశారు. తగ్గిన జీఎస్టీ ప్రకారం విక్రయాలు చేయాలని, జీఎస్టీ తగ్గినా వస్తువులను ఎక్కువ ధరలకు విక్రయించినట్లు ఫిర్యాదులు వస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. నిబంధన మేరకు దుకాణాలలో వినియోగదారులకు నాణ్యమైన వస్తువులను విక్రయించాలన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ సేల్స్ టాక్స్ అధికారి వివేక్, సిబ్బంది పాల్గొన్నారు.

గుడిపాలలో..

గుడిపాల: కేంద్ర ప్రభుత్వం తగ్గించిన జీఎస్టీపై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ ఎంపీడీఓ కుమార్ తెలిపారు. ఆదివారం మండల కేంద్రంలోని కిరాణా షాపుల వద్ద నిత్యావసర సరుకులకు వస్తున్న వినియోగదారులకు ఆయన అవగాహన కల్పించారు. జీఎస్టీ తగ్గుదలతో నిత్యావసర సరుకులన్నీ తక్కువ ధరకే అందుతాయన్నారు. గతంలో 12శాతం నిత్యావసర వస్తువులపై ఉన్న జీఎస్టీ ప్రస్తుతం 7శాతం తగ్గుదలతో సామాన్య కుటుంబాలకు ఊరట కలిగిందన్నారు. నిత్యావసర వస్తువులపై ప్రస్తుతం రేట్లన్నీ తగ్గాయని, అధిక ధరలకు విక్రయిస్తే దుకాణదారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

వైభవంగా భద్రకాళి ఉత్సవాలు


పూజలందుకుంటున్న భద్రకాళి మాత


ఆలయం వద్ద చేస్తున్న హోమం

గుడిపాల: మండలంలో నరహరిపేట చెక్‌పోస్ట్ సమీపంలోని శ్రీభద్రకాళి ఆలయంలో ఆదివారం ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. సంతాన ప్రదాయినిగా, సకల రుగ్మతలను రూపుమాపే దేవతగా అమ్మవారిని మూడు దశాబ్దాల నుంచి భక్తులు కొలుస్తున్నారు. మండల ప్రజలకే కాకుండా సమీపంలోని తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలనుండి విశేష సంఖ్యలో భక్తులు ఏటా ఈ ఉత్సవాలకు హాజరు కావడం విశేషం. ఆలయంలో ఆదివారం ఉదయం వేదపండితులు శాస్త్రోక్తంగా హోమం చేశారు. వసంతాపురం గ్రామానికి చెందిన యోగపతి, మునికాంతమ్మ దంపతులు హోమం, అభిషేకాలు, పూజలు చేయడంతో పాటు మధ్యాహ్నం అన్నదానం చేశారు. భక్తులు మొక్కలు చెల్లించారు. రాత్రి ఆదిపరాశక్తి మిస్ట్ ఒళి శివపూజ వీధినాటకాన్ని ప్రదర్శించారు.

నోటీస్ బోర్డు

నేడు 'సినారె సాహితీ వైభవం'

- **చిత్తూరు రూరల్ (కాణిపాకం):** అంతర్జాతీయ ఖ్యాతిగాంచిన సాహితీ శిఖరం పద్మభూషణ్, నవీద్ పురస్కారాల గ్రహీత ఆచార్య సి.నారాయణరెడ్డిపై 'సినారె సాహితీ వైభవం' కార్యక్రమం సోమవారం నిర్వహించనున్నట్టు భారతీయ తెలుగు రచయితలు సమాఖ్య. డి దేవేంద్ర తెలిపారు. చిత్తూరు నగరం కొంగారెడ్డిపల్లెలోని బ్రెయిన్ బాక్స్ అకాడమీ భవనంలో ఉదయం 10 గంటలకు నిర్వహించే ఈ కార్యక్రమంలో సినారె గీతాలాపన, కవితార్చన ఉంటుందన్నారు, అనంతరం 30మంది రచయితలు, గాయకులకు సినారె జాతీయ పురస్కారాలు–2025 ప్రదానం చేయనున్నట్టు తెలియజేశారు.

గ్రీవెన్స్ డే

- **చిత్తూరు అర్బన్:** చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం ఉదయం 10.30 గంటల నుంచి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (గ్రీవెన్స్‌డే) నిర్వహించనున్న ట్లు కమిషనర్ నరసింహప్రసాద్ ఓ ప్రకటనలో తెలిపారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదిక

- **ఐరాల:** తమ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ లోకేశ్వరి తెలిపారు.మండల ప్రజలు సమస్యలను నివేదించి పరిష్కరించుకోవాలని కోరారు.
- **తవణంపల్లె:** మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్టు ఇన్‌చార్జి ఎంపీడీఓ రెడ్డి బాబు తెలిపారు.

టి.పుత్తూరులో స్వస్థ్ నారీ..

- **తవణంపల్లె:** మండలంలోని టి.పుత్తూరు సచివాయలంలో సోమవారం స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ ఆరోగ్య శిబిరం నిర్వహిస్తామని తవణంపల్లె వైద్యాధికారి డాక్టర్ ప్రియాంక తెలిపారు. ఉచిత ఆరోగ్య శిబిరంలో రక్తపోటు, మధుమేహం, నోటి క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్, గర్భాశయ క్యాన్సర్, తల్లీబిడ్డ సేవలు, వయోవృద్ధులకు ఆరోగ్య పరీక్షలు, కిశోర బాలికల ఆరోగ్య పరీక్షలు, క్షయవ్యాధి స్క్రీనింగ్ పరీక్షలునిర్వహిస్తామని పేర్కొన్నారు. మండల ప్రజలు దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సొసైటీలో మహాజన సభ

- **యాదమరి:** స్థానిక సొసైటీ ఆవరణలో సోమవారం ఉదయం 10 గంటలకు మహాజన సభ నిర్వహిస్తున్నట్లు సింగిల్‌విండో అధ్యక్షురాలు చిత్రానాయుడు తెలిపారు. సభ్యులందరూ హాజరు కావాలని కోరారు.

సరస్వతీ మాతా నమోస్తుతే..!


బంగారుపాళెం: సరస్వతిదేవిగా ముత్యాలమ్మ


దుర్గాంబ దేవస్థానంలో మహిషాసురమర్దిని అలంకారం

బంగారుపాళెం: దసరా ఉత్సవాలలో భాగంగా ఆదివారం ఏడో రోజు బంగారుపాళెం గ్రామ దేవత ముత్యాలమ్మ సరస్వతిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం అమ్మవారికి పూజలు, అభిషేకాల అనంతరం ఆలయ అర్చకుడు మురళీస్వామి ఉత్సవమూర్తిని సరస్వతిదేవిగా అలంకరించి ధూప దీప నైవేద్యాలు సమర్పించారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులకు నిర్వాహకులు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. మండల కరణం సంక్షేమ సంఘం ఉభయదారులుగా వ్యవహరించింది. ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు

వజ్రాలపురంలో..

మండలంలోని వజ్రాలపురం బోయ కొండగంగమ్మ..దుర్గాదేవిగా భక్తులకు అభయమిచ్చారు. ఉదయం అమ్మవారిని దుర్గాదేవిదేవిగా అలంకరించి పూజలు చేశారు. ఆలయ ధర్మకర్త కృష్ణప్ప, మేనేజరు మొగిలప్ప, కమిటీ సభ్యులు పాల్గొన్నారు

మహిషాసురమర్దినిగా దుర్గాంబ

చిత్తూరు రూరల్(కాణిపాకం): చిత్తూరు గిరింపేటలోని దుర్గాంబ దేవస్థానంలో ఆదివారం రాత్రి అమ్మవారు మహిషాసురమర్దినిగా దర్శనమిచ్చారు. అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. ఆలయ చైర్మన్ దిలీప్‌రెడ్డి, ఈఓ తిమ్మారెడ్డి ఉభయదారులను సన్మానించారు. అలాగే కోదండరామస్వామి ఆలయంలో వామనావతరం, కొంగారెడ్డిపల్లెలోని ఎట్టిమ్మ దేవస్థానంలో మహాచండిదేవి అలంకారం, షిరిడి విశ్వసాయిబాబా ఆలయంలో మహాలక్ష్మీదేవి అలంకారం, బ్రహ్మకుమారీస్ చిత్తూరు కేంద్రంలో పార్వతీదేవి అలంకారంలో అమ్మవారు భక్తులను అనుగ్రహించారు.


మహిషాసురమర్దిని అలంకరణలో దుర్గమ్మ

గుడిపాల: మండలంలో కందగిరి కొండవద్ద ఉన్న శ్రీవళ్లీదేవసేన సమేత సుబ్రమణ్యస్వామి దేవాలయంలో మూలస్థాన దుర్గమ్మ ఆదివారం మహిషాసురమర్దిని అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అలాగే పల్లూరులోని గంగమ్మ దేవాలయంలో అమ్మవారికి ప్రత్యేకంగా అభిషేకాలు, పూజలు చేశారు. సాయంత్రం కాళికాదేవి అలంకరణలో దర్శనమిచ్చారు.

ఐరాల: స్థానిక పాలేటమ్మ ఆలయం ఆదివారం సాయంత్రం అమ్మవారు కాళికాదేవిగా, వైఎస్ గేటులో చాముండేశ్వరిదేవి అమ్మవారు కరెన్సీ నోట్లతో మహాలక్ష్మిగా, పాతపాళ్యంలో ఓం శక్తి శాకంబరి దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.











ఎట్టిమ్మ ఆలయంలో మహా చండీదేవి అలంకారం
కోదండరామస్వామి ఆలయంలో వామనావతారం
మహాలక్ష్మీదేవి అలంకారం
గుడిపాల: మహిషాసురమర్దిని అలంకరణ, గంగమ్మ వద్ద కాళికాదేవిగా..
ఐరాల: కాళికాదేవిగా పాలేటమ్మ, కరెన్సీ నోట్లతో చాముండేశ్వరి, శాకంబరి దేవి అలంకరణలో ఓం శక్తి మాత
బంగారుపాళెం: దుర్గాదేవిగా వజ్రాలపురం గంగమ్మ

ఘనంగా గుర్రం జాషువా జయంతి


నివాళులర్పిస్తున్న తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి సభ్యులు

పలమనేరు: జాషువా సాహిత్యాన్ని నేటి తరానికి పరిచయం చేయాలని స్థానిక తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి నిర్వాహకులు తులసీనాథంనాయుడు అన్నారు. స్థానిక కళామందిరంలో ఆదివారం గుర్రం జాషువా జయంతి నిర్వహించారు. జాషువా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తులసీనాథం నాయుడు మాట్లాడుతూ తెలుగు సాహిత్యం కోసం గుర్రం జాషువా చేసిన కృషిని ప్రస్తుత తరం గౌరవించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఆయన మార్గంలో రచయితలు పయనించాలని కోరారు. కార్యక్రమంలో ఎంఈవో శ్రీనివాసులు, పుష్ప, దామోదరనాయుడు, జమున, కుమారి, భార్గవి తదితరులు పాల్గొన్నారు.